క్లుప్తంగా

జీలుగ విత్తనాల పంపిణీ



పెర్కిట్(ఆర్మూర్): మండలంలోని అంకాపూర్, ఆలూర్ మండలం దేగాం, పెర్కిట్ గ్రామాల్లో శుక్రవారం సొసైటీల ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. అంకాపూర్‌లో మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెర్కిట్ సొసైటీ చైర్మన్ పెంట భోజా రెడ్డి, ఆలూర్ సొసైటీ వైస్ చైర్మన్ రాజేశ్వర్, సర్పంచ్ గంగా రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి సన్మానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని వడ్డెర కాలనీలో శుక్రవారం వడ్డెర సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఖాందేష్ శ్రీనివాస్ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి సభ్యులు కృషిచేయాలని, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రెడ్డి సహకారంతో వడ్డెర సంఘం అభివృద్ధికి, నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమములో బీఆర్‌ఎస్ నాయకులు ఖాందేష్ సత్యం, మక్కల సాయినాథ్, నరేశ్, సుధాకర్, వడ్డెర సంఘం పెద్దలు మాగిని ఎల్లయ్య, మక్కల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

బోధన్‌టౌన్(బోధన్): ఇటీవల రష్యాలో జరిగిన మాస్కో ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్–2023 మార్షల్ ఆర్ట్స్ వూషో విభాగంలో రెండు రజత పతకాలను సాధించిన సద్దాం హుస్సేన్‌ను ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా సద్దాం హుస్సేన్ మాట్లాడారు. నిర్మల్ జిల్లా బాసర మండలంలోని సాలాపూర్ గ్రామానికి చెందిన తనకు ఇటీవల రష్యాలో జరిగిన మాస్కో ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్–2023 మార్షల్ ఆర్ట్స్ వూషో విభాగంలో పాల్గొనడానికి ఎమ్మెల్యే సతీమణి అయేషా స్పాన్సర్ చేశారని, మొత్తం ఆమే భరించారని తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్యే సతీమణిలకు రుణపడి ఉంటానన్నారు.

బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్ కాలనీలో బెల్టు షాపులను తక్షణమే తొలగించాలని గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ రూప్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు మాట్లాడారు. కాలనీలో బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల అపరిచిత వ్యక్తులు కాలనీలో తిరుగుతున్నారని, మద్యం మత్తులో దొంగతనాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్టు దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కమ్మర్‌పల్లి: చౌట్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డం ధర్మేందర్‌ను ఆరెంజ్ ట్రావెల్స్ యజమాని ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ధర్మేంధర్ కుమారుడు రేవంత్ ఇటీవల వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందాడు. దీంతో సునీల్‌రెడ్డి పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

టీయూ ఎన్‌టీఎస్‌ఏ కమిటీ ఎన్నిక



తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ (టీయూఎన్‌టీఎస్‌ఏ) నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా సాయాగౌడ్, ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, జనరల్ సెక్రెటరీగా భాస్కర్, జాయింట్ సెక్రెటరీగా వినోద్‌కుమార్, కోశాధికారిగా జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఉమారాణి, ఈసీ మెంబర్లుగా మనోహర్‌గౌడ్, శ్రీవాణి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఫైనాన్స్ ఆఫీసర్ ఖాదర్ మొయినుద్దీన్ వ్యవహరించారు. ఈ కమిటీ మూడేళ్లు కొనసాగనుంది. కమిటీ సభ్యులను వీసీ రవీందర్‌గుప్తా, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కనకయ్య అభినందించారు.

కేంద్రంలో అవినీతి ప్రభుత్వ పాలన

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి
- నందిపేట్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి పక్కన పీయూసీ చైర్మన్ జీవన్‌రెడ్డి



నందిపేటలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి

నందిపేట్(ఆర్మూర్): కేంద్రంలో పీఎం నరేంద్రమోదీ నాయకత్వాన అవినీతి, అసమర్థ ప్రభుత్వ పాలన నడుస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నందిపేటలోని మున్నూర్‌కాపు కల్యాణ మండపంలో శుక్రవారం ఉమ్మడి నందిపేట మండల స్థాయి బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ శాసన సభాపతి మధుసూదనాచారి, పీయూసీ చైర్మన్ జీవన్‌రెడ్డితో కలిసి మంత్రి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దేశంలో బీఆర్ఎస్ పార్టీ ఎదిగినంతగా ఏ పార్టీ ఎదగలేదన్నారు. నరేంద్రమోడీ దేశాన్ని అమ్మేస్తున్నాడని దుయ్యబట్టారు. తెలంగాణపై కక్షసాధింపు చర్యలతో ఎలాంటి నిధులు ఇవ్వలేదని, అలాగే మెడికల్ కాలేజీలు, నవోదయ పాఠశాలలు ఇవ్వలేదన్నారు. బాండ్ పేపర్ రాసిచ్చి రైతులను మోసం చేసిన ఎంపీ అరవింద్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు మాట్లాడే హక్కు లేదన్నారు. దేశంలో కేసీఆర్ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో తెలంగాణలో కేసీఆర్ నాయకత్వాన ఆదర్శ పాలన జరుగుతుందని పీయుసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. దేశప్రజలందరూ కేసీఆర్ వైపు చూస్తున్నారన్నారు. దేశంలోనే ఎక్కడ లేని అభివృద్ధిని సాధిస్తున్న తెలంగాణ రాష్ట్రం విశ్వవేదికపై ఖ్యాతిని ఇనుమడింపజేస్తుందని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనచారి అన్నారు. అనంతరం కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దంపతులు నూతన వస్త్రాలను అందజేశారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, రాష్ట్ర నాయకులు రాజారాం యాదవ్, కోటపాటి నరసింహనాయుడు, ఎంపీపీ వాకిడీ సంతోష్ రెడ్డి, జెడ్పీటీసీ ఎర్రం యమున ముత్యం తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలి



మొక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆర్మూర్‌టౌన్: హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించి రానున్న తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. పట్టణంలోని బృహత్ పట్టణ ప్రకృతి వనంలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని తమవంతుగా మొక్కలు నాటాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్, డీఈ భూమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీలను మోసం చేస్తున్న ప్రభుత్వం



కరపత్రాలను విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్: మైనార్టీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేస్తుందని, కేవలం ఓట్ల కోసం వాడుకుంటుందని కాంగ్రెస్ నాయకుడు కోల వెంకటేష్ ఆరోపించారు. పట్టణంలోని జిరాయత్ నగర్‌లో మైనార్టీకు ఇచ్చిన హామీల గురించి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రభుత్వం మోసం చేందన్నారు. ఎమ్మెల్యే సైతం ఆర్మూర్‌లో మైనార్టీలకు షాదీఖానా, ఈద్గా, పెర్కిట్‌లో ఖబరస్థాన్‌లో దుకాణ సముదాయానికి నిధులు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హయంలో మైనార్టీలకు అన్ని రంగాల్లో న్యాయం జరిగిందన్నారు. నాయకులు మీర్ మాజీద్, మెహబూబ్, ఉస్మాన్, మందుల పోశెట్టి, పాషా, బాల కిషన్, అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారు



ఏర్గట్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం బట్టాపూర్ క్రషర్ వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతో పాటు పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని, వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పడానికి తాము ప్రయత్నిస్తుంటే బీఆర్‌ఎస్ నేతలకు మింగుడుపడటం లేదని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడటం వారి విజ్ఞతకే వదలివేస్తున్నాయని వారు చెప్పారు. ఏర్గట్లలో శుక్రవారం డీసీసీ ఉపాధ్యక్షుడు శివనోల్ల శివకుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సోమ దేవారెడ్డిలు మాట్లాడారు. క్వారీ, క్రషర్‌తో పాటు తారు ప్లాంట్‌ను నిర్వహిస్తున్నారని ఇవన్నీ నిబంధనలకు విరుద్ధంగానే కొనసాగుతున్నాయని ఆరోపించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి అండదండలు ఉండటం వల్లనే అక్రమాలు సాగుతున్నాయని ఉద్ఘాటించారు.నాయకులు గడ్డం జీవన్, ముస్కు మోహన్, బద్దం లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నేత అడ్లూరి శ్రీనివాస్

పెర్కిట్(ఆర్మూర్): రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారం సాధించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సభ్యుడు అడ్లూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పెర్కిట్‌లో శుక్రవారం నిర్వహించిన బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశానికి అడ్లూరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ అధిష్టానం అభ్యర్థులుగా ఎవరిని ప్రకటించినా పాత, కొత్త అనే తేడా లేకుండా గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. అలాగే ఈ నెల 30 నుంచి నెల రోజుల పాటు నిర్వహించే మహాజన్ సంపర్క్ అభియాన్ యోజనలో భాగంగా ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను గడపగడపకూ చేరవేయాలన్నారు. తెలంగాణ అసెంబ్లీతో పాటు ఆర్మూర్ మున్సిపాలిటీలో సైతం బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహా రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్, నాయకులు కంచెట్టి గంగాధర్, యామాద్రి భాస్కర్, పోల్కం వేణు, ఆకుల రాజు, మందుల బాలు, తూర్పు రాజు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బుద్దె సావిత్రి

బోధన్‌రూరల్(బోధన్): బోధన్, సాలూర మండలాల్లోని గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. సీఎం కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే షకీల్ ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం దశాబ్ది ఉత్సవాలు గ్రామాల్లో నిర్వహించాలని ఆమె సూచించారు. ఎంపీడీవో పర్బన్న, ఎస్సై సందీప్, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం యువత ఉద్యమించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి భాస్కర్

బోధన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పాలనా విధానాల కారణంగా నిరుద్యోగ సమస్య తీవ్రమవుతోందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువత ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి భాస్కర్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన పీవైఎల్ జిల్లా 7వ మహాసభలో ప్రారంభ ఉపన్యాసం చేశారు. భాస్కర్ మాట్లాడుతూ.. విద్వేష రాజకీయాలకు దూరంగా ఉండాలన్నారు. పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు పుట్ట వరదయ్య మాట్లాడుతూ.. భగత్‌సింగ్, ఆజాద్ చంద్రశేఖర్, అల్లూరి సీతారామరాజులాంటి వీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు గడ్డం గంగులు, పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, ఐకేపీ వీఏవోల సంఘం జిల్లా అధ్యక్షుడు పోశెట్టి, ఏఐకెఎంఎస్ నేత గంగాధర్ మాట్లాడారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో పీవైఎల్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా ప్రేమ్‌సింగ్, సంతోష్, ప్రధాన కార్యదర్శిగా కిషన్, సహాయ కార్యదర్శులుగా వినోద్‌కుమార్, నవీన్, కోశాధికారిగా జగదీష్, కార్యవర్గ సభ్యులుగా సత్యనారాయణ, ఆర్.సురేష్, కృష్ణం రాజు, మేకల రాజశేఖర్‌లను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు వరదయ్య తెలిపారు.

ఫంక్షన్ హాలు నిర్మాణ పనులు ప్రారంభం



వేల్పూర్: మండల కేంద్రంలో మైనార్టీ ఫంక్షన్ హాలు నిర్మాణ పనులను ఎంపీపీ బీమ జమున, బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఫంక్షన్‌హాలు నిర్మాణానికి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌టీఏ సభ్యుడు రేగుల్ల రాములు, సర్పంచ్ తీగెల రాధామోహన్, ఉప సర్పంచ్ పిట్ల సత్యం, ఎంపీటీసీ మొండి మహేశ్, నాయకులు రాకేశ్‌చంద్ర, సామ మహిపాల్, జైడి నాగధర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చట్టం–2019 ప్రకారం బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపార నిర్వాహకులు ఈ నెల 31 లోపు నూతన ట్రేడ్ లైసెన్స్, ఇది వరకే ఉన్నవారు రెన్యూవల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ సూచించారు. నూతన ట్రేడ్ లైసెన్సు, రెన్యూవల్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లైసెన్స్ వారి వ్యాపార సముదాయాలను మూసివేస్తామని హెచ్చరించారు.

కబడ్డీ టీం విజేతగా సుర్భిర్యాల్ జట్టు



పెర్కిట్(ఆర్మూర్): జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సీఎం కప్ కబడ్డీ పోటీల్లో ఆర్మూర్ మండలం సుర్భిర్యాల్ జట్టు విజేతగా నిలిచింది. గ్రామంలో క్రీడాకారులతో పాటు, కోచ్ గంగా రెడ్డిలను బీఆర్‌ఎస్ నాయకుడు, సుర్భిర్యాల్ సర్పంచ్ భర్త సట్లపల్లి గణేష్ అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయిలో సైతం విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. సీనియర్ క్రీడాకారులు యోగేష్ కన్నా, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

ఎడపల్లి(బోధన్): తాడెం గ్రామంలో ఎడపల్లి పోలీసులు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కుటుంబసభ్యులు యువకులపై దృష్టి పెట్టాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలతో అనారోగ్యంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు.

నేడు రెంజల్ మండల సమావేశం

రెంజల్(బోధన్): రెంజల్ మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. ఎంపీపీ లోలపు రజని అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, విండో చైర్మన్‌లతో పాటు అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



ఆర్మూర్‌టౌన్: అంబేడ్కర్ చౌరస్తా వద్ద..



రుద్రూర్‌లో ..

ఆర్మూర్‌టౌన్/వర్ని/రుద్రూర్ : జిల్లాలో వీవోఏల సమ్మె కొనసాగుతోంది. శుక్రవారానికి సమ్మె 33వ రోజుకి చేరుకుంది. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వీవోఏలు కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని అన్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు. డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.



వర్నిలో ..

వైభవంగా బారెడు పోచమ్మ పండగ



చిక్కడపల్లిలో, పోతంగల్ మండల కేంద్రంలో శుక్రవారం బారెడు పోచమ్మ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ర్యాలీగా ఆలయానికి వచ్చి నైవేద్యాలు సమర్పించారు. పోతంగల్‌లో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. - రుద్రూర్

పుష్కరక్షేత్రంలో భక్తుల సందడి

రెంజల్(బోధన్) : కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రం శుక్రవారం భక్తులతో సందడిగా మారింది. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. నైవేద్యాలు తయారు చేసి నదిలో తెప్పలు వదిలారు. నదిలోని పురాతణ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండలు మండటంతో భక్తులు ఒడ్డున గల చెట్ల నీడలో వంటలు చేసుకుని ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఎంసెట్‌లో మైనార్టీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు ఎంసెట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ సయ్యద్ హైదర్ శుక్రవారం తెలిపారు. ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగంలో కళాశాలకు చెందిన సాయి దినేష్ 18,435 ర్యాంకు, తబ్రేజ్ హుస్సేన్ 39,506 ర్యాంకు, విజయ్ కుమార్ 26,964 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. అలాగే మెడికల్ అండ్ అగ్రికల్చరల్ విభాగంలో మహ్మద్ మోబిన్ 24,054, మొహ్మద్ ఇక్రమ్ 34,232, మహ్మద్ జునైద్ ఖాన్ 44,863 ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు ప్రిన్సిపల్ సయ్యద్ హైదర్, అధ్యాపకులు హస్నాథ్, వినోద్, ప్రశాంత్, దత్తాద్రి, రాజ్‌పాల్, దస్తగిరి అభినందించారు.

మహేశ్ పట్టుదల యువతకు స్ఫూర్తిదాయకం



మహేశ్‌ను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బోధన్ : బోధన్‌కు చెందిన కంఠం మహేశ్ కుమార్ సివిల్స్ తుది పరీక్ష ఫలితాలో ఆలిండియా 200 ర్యాంక్ సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణ కేంద్రంలోని లయన్స్ కంటి ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాలువా, జ్ఞాపికలతో సన్మానించి క్లబ్ ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ లక్ష్మి బసవేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సివిల్స్ ర్యాంకర్ మహేశ్ పట్టుదల నేటితరం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. కలెక్టర్ కావాలనే దృఢ సంకల్పంతో ఎన్నో అవరోధాలను ఎదురొడ్డి కష్టపడి చదివి అనుకున్న లక్ష్యం సాధించడం ఎంతో సంతోషకరమన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు బసవేశ్వర్‌రావు, కొడాలి కిషోర్, ప్రతాప్ గుప్తా, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



రుద్రూర్: రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, అగ్రికల్చర్ కాంట్రాక్టు డైలీ వైస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రమేశ్ బాబు డిమాండ్ చేశారు. రుద్రూర్ అగ్రికల్చర్ ఫారంలో కాంట్రాక్టు, డైలీవైస్ కార్మికులతో శుక్రవారం సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పరిశోధన కేంద్రం అధిపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.900 చొప్పున చెల్లించాలని, నెలలో 20 రోజులకు తగ్గకుండా పని కల్పించాలని కోరారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి నవీన్, ఉపాధ్యక్షులు బాలమణి, అనసూయ, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



రుద్రూర్: మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి కుట్టు శిక్షణ లాంటివి ఎంతో అవసరమని జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్‌లో మహిళల కోసం 45 రోజుల ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువుతో పాటు వృత్తి విద్య కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 45 రోజుల కోర్సు ప్రస్తుతం రెండు బ్యాచ్‌లుగా నిర్వహిస్తారని తెలిపారు. మహిళల ఆసక్తిని బట్టి మూడో బ్యాచ్‌కు టైలరింగ్ శిక్షణ ఇచ్చేందుకు నిర్వాహకులు సిద్ధంగా ఉన్నారని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు సునీత, బోధన్ సీడీపీవో జానకమ్మ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు శ్రీలత, మణి, ప్రోగ్రాం ఇన్‌చార్జి కొత్తపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



మాక్లూర్: సీఎం కేసీఆర్ తెలంగాణలోని పేదల సౌకర్యార్థం కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకొచ్చారని, సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పేర్కొన్నారు. మాక్లూర్‌లో ఉర్దూ మీడియం పాఠశాలలో శుక్రవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. అవసరమైన వారికి కంటి అద్దాలు ఉచితంగా అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సుదర్శనం, ఎంపీడీవో క్రాంతి, ఎంపీటీసీ వెంకటేశ్వర్ రావు, నాయకులు నర్సాగౌడ్, తాజుద్దీన్, కరీం పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 –	ఫాస్ట్ ఎక్స్ (తెలుగు) 10.30, 4.10, 7.10 గ్రే: ది స్పై హు లవ్డ్ మీ (తెలుగు) 1.30 2018 (తెలుగు) – 10.10 (రాత్రి)
స్క్రీన్-2 –	బిచ్చగాడు2 – 12.15, 3.30, 6.45, 10.00
స్క్రీన్-3 –	మేమ్ ఫేమస్ – 10.30, 4.30, 10.30 మళ్లీ పెళ్లి – 1.40, 7.40
స్క్రీన్-4 –	మెన్‌టూ (తెలుగు) – 12.20, 9.15 2018 (తెలుగు) – 3.05 ది కేరళ స్టోరీ (తెలుగు) – 6.15